

# ఇక్కడ ఎవరి ఐడియాలజీ వాళ్లది

ఒకరితో ఒకరిని పోల్చి మాట్లాడటం సినిమారంగంలో కామనే. హీరోల విషయంలో అది మరీ కామన్. అందునా ఇద్దరూ రాజకీయపార్టీలు నెలకొల్పిన స్టార్ హీరోలైతే ఇక చెప్పేదేముంది? వారి విజయాలపై అపజయాలపై స్టోరీలే రాసేస్తుంటారు నెటిజన్స్. ముఖ్యంగా సోషల్ మీడియా ఎక్కువయ్యాక ఈ ట్రెండ్ మరీ ఎక్కువైంది. రీసెంట్‌గా అగ్ర నటుడు కమల్‌హాసన్ ఈ అంశంపైనే ప్రశ్నలను ఎదుర్కొన్నారు. వివరాల్లోకెళ్తే.. 'తమిళ వట్రి కళగం' పేరుతో నటుడు విజయ్ ఇటీవలే పార్టీ నెలకొల్పిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలు రానున్న సందర్భంగా సినిమాలకు పూర్తిగా దూరమవుతున్నట్టు విజయ్ ప్రకటించారు. ఈ విషయంపై కమల్‌కి మీడియా నుండి ప్రశ్నలెదురయ్యాయి. సాటి హీరో సినిమాలను వదిలి పూర్తి జీవితం రాజకీయాలకే అంకితం చేస్తుంటే, మీరు రాజకీయ పార్టీ పెట్టి కూడా సినిమాలు చేస్తున్నారు. అనేది? అనేది కమల్‌కి ఎదురైన ప్రశ్న. కమల్ మాట్లాడుతూ 'ముందు విజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. రాజకీయంగా అతడ్ని ప్రోత్సహించిన వారిలో నేనూ ఒకడ్ని. ఈ విషయంపై ఇద్దరం చర్చించుకున్నాం కూడా. రాజకీయాలా? సినిమాలా? అనేది మా వ్యక్తిగతం. ఎవరి ఐడియాలజీ వారిది. నేను చేసినట్టు తను చేయాలని లేదు. తను చేసినట్టు నేను చేయాలని లేదు. ఎవరి సామర్థ్యం వారిది. అద్భుతమైన సాహిత్యం రాసే గీతరచయితలా మమ్మల్నీ పాట రాయమంటే అది మాకెలా కుదురుతుంది చెప్పండి. మాకు తెలిసింది మాకు నచ్చినట్టు మేం చేస్తాం. నా వరకూ రాజకీయాల్లో ఉంటూనే సినిమాలు చేస్తాను. ఇది నా శైలి' అంటూ చెప్పుకొచ్చారు కమల్‌హాసన్.

# న్యాయ పోరాటానికి దిగిన త్రిష..



ఇరవై ఏళ్లకు పైనే కెరీర్. నేటికీ చెదరని స్టార్ స్టేటస్ వెరసి త్రిష కృష్ణన్. గత ఏడాది మూడు సినిమాల్లో కథానాయికగా నటించింది త్రిష. మూడూ ప్రెస్టేజియస్ ప్రాజెక్టులే. ఈ ఏడాది అయిదు సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. వాటిలో చిరంజీవి 'విశ్వంభర' ఒకటి. ఇంత లాంగ్విటీ ఉన్న హీరోయిన్లు అరుదుగా మాత్రమే ఉన్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. వీటన్నింటినీ మించి త్రిష మంచి నటి. అంతటి ప్రతిభావంతురాలు కాబట్టే నేటికీ కథానాయికగా ఆదరింపబడుతున్నారమె. అలాంటి నటిని గౌరవించాల్సింది పోయి, నోటికొచ్చినట్టు తూలనాడాడు తమిళనాడు ఏఐఏడీఎంకే నాయకుడు ఏవీ రాజు. త్రిష వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆ వార్తలు, వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా విపరీతంగా వైరల్ అయ్యాయి. రాజు వ్యాఖ్యలను ఖండిస్తూ తీవ్ర విమర్శలు కూడా వెల్లువెత్తాయి. త్రిషకు చిత్ర పరిశ్రమ నుంచి కూడా మద్దతు లభించింది. ఈ పరిణామంపై ఇప్పటికే స్పందించిన త్రిష.. రీసెంట్‌గా ఏవీ రాజుపై న్యాయపోరాటానికి దిగింది. అతనిపై పరువునష్టం దావా వేసింది. ట్విటర్ వేదికగా కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేసింది. మరి ఈ గొడవ ఇంకెంత దూరం వెళ్తుందో చూడాలి.

# శ్మశానంలో టీజర్ వేడుక



అంజలి కథానాయికగా నటించిన 'గీతాంజలి' చిత్రం హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా మెప్పించింది. దీనికి సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమాను తెరకెక్కిస్తున్నారు. శివ తుర్లపాటి దర్శకుడు. కోన ఫిల్మ్ కార్పొరేషన్, ఎం.వి.వి.సినిమాస్ పతాకాలపై కోన వెంకట్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. అంజలి నటిస్తున్న 50వ చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమా టీజర్‌ను వినూత్న పంథాలో విడుదల చేయబోతున్నారు. హారర్ కథాంశం కావడంతో టీజర్‌ను ఈ నెల 24న బేగంపేట శ్మశానంలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. శ్మశానంలో ఓ సినిమా వేడుక జరగడం ఇదే తొలిసారి అని చిత్రబృందం చెబుతున్నది. మొదటి భాగం 'గీతాంజలి' ఎక్కడైతే ముగిసిపోయిందే అక్కడే ఈ సీక్వెల్ కథ ఆరంభమవుతుందని, ఆద్యంతం హాస్యంతో ఆకట్టుకుంటుందని, పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తామని నిర్మాతలు తెలిపారు. అంజలి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, సత్య, షకలక శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, స్క్రీన్‌ప్లే: కోన వెంకట్, భాను భోగవరపు, కథ: కోన వెంకట్, దర్శకత్వం: శివ తుర్లపాటి.



# నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్

పిల్లలు ఆడుకునేటప్పుడు సరదాగా వాడే మంత్రం 'ఓం భీం బుష్'. ఈ పేరుతో ఓ చిత్రం రానుంది. 'నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్' అనేది ఉపశీర్షిక. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రధారులు. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. సునీల్ బులుసు నిర్మాత. మార్చి 22న విడుదల కానున్న ఈ సినిమాకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. హీరోలు ముగ్గురూ కరపత్రాలతో స్టైలిష్‌గా నడుచుకుంటూ వస్తున్నారు. వీరంతా వ్యోమగామి దుస్తుల్లో ఉండటం విశేషం. ఈ విధంగా ఫస్ట్‌లుక్‌తోనే ఆసక్తిని రేకెత్తించారు 'ఓం భీమ్ బుష్' మేకర్స్. ఆద్యంతం వినోద ప్రధానంగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు దర్శక, నిర్మాతలు తెలిపారు. ప్రీతి ముకుందన్, అయేషాఖాన్ కథానాయికలుగా నటిస్తున్న ఈచిత్రంలో శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్, రచ్చ రవి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: సన్నీ ఎం.ఆర్



# తెలుగు నేర్చుకుంటున్నా!

నిజంగా జాన్వీకపూర్ లక్కీ హీరోయిన్. తెలుగులో ఎంట్రీ ఇస్తూనే రెండు భారీ సినిమాల్లో కథానాయికగా అవకాశాలను దక్కించుకుంది. ఈ భామ అరంగేట్ర చిత్రం 'దేవర' షూటింగ్ జరుగుతుండగానే.. మరో అగ్ర హీరో రామ్‌చరణ్ సరసన నాయికగా ఛాన్స్ కొట్టేసింది. బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా చిత్రంలో జాన్వీకపూర్‌ను కథానాయికగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు పాన్ ఇండియా సినిమాలే కావడం విశేషం. తెలుగులో భారీ సినిమా అవకాశాలతో జాన్వీకపూర్ చాలా ఆనందంగా ఉందట. తన తల్లి, దివంగత శ్రీదేవిని ఆదరించినట్లుగానే తెలుగు ప్రేక్షకులు తనపై ప్రేమాభిమానాలు చూపిస్తారనే నమ్మకంతో ఉందట. ఈ నేపథ్యంలో తాను తెలుగు భాషలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపింది జాన్వీకపూర్. ఇక నుంచి ఈ రెండు చిత్రాల సెట్స్‌లో తెలుగులోనే కమ్యూనికేట్ చేస్తానని, భవిష్యత్తులో హిందీతో పాటు టాలీవుడ్‌కు సమ ప్రాధాన్యం ఇస్తానని జాన్వీకపూర్ పేర్కొంది.

# దారితప్పిన జీనియస్ ప్రయాణం

' ఒక రాంగ్ ఫిలాసఫీలో ఇరుక్కుపోయి జీవితాన్ని ఇబ్బందులపాలు చేసుకున్న ఓ జీనియస్ కథ 'సిద్దార్థ్ రాయ్'. అతని ఎమోషన్, అతని ప్రేమ భరించడం కష్టం. ఆకలితోవున్న ఒక నటుడికి ఇంత కంటే మంచి పాత్ర వస్తుందా? అనిపించింది. కథ విన్నాక ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి' అన్నాడు హీరో దీపక్ సరోజ్. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'సిద్దార్థ్‌రాయ్'. తాన్వి కథానాయిక. వి.యశస్వి దర్శకుడు. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మాతలు. నేడు ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అతిథులుగా వచ్చిన కిరణ్ అబ్బవరం, కోనవెంకట్, నక్కిన త్రినాథరావు చిత్ర యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. ఇంకా దీపక్ సరోజ్ మాట్లాడుతూ ' నన్ను నేను నిరూపించుకోటానికే ఈ సినిమా చేశాను. సాంకేతికంగా అద్భుతంగా ఉంటుందీ సినిమా' అని తెలిపారు దీపక్ రాజ్. సినిమాలపై ఉన్న ప్రేమతో ఈ రంగంలోకి వచ్చానని, నా ప్రయాణంలో సహకరించిన అందరికీ ధన్యవాదాలని దర్శకుడు చెప్పారు. ఇంకా హీరోయిన్ తన్వి కూడా మాట్లాడారు.





# పరిధులను పక్కన పెట్టేసింది..

పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలంటే కష్టమైనా.. ఇష్టం లేకపోయినా కొన్ని చేయాల్సిందే. సినిమా రంగంలో మరీనూ. కొందరు హీరోయిన్ల విషయంలో ప్రేక్షకుల దృక్కోణం ఒకలా ఉంటుంది. కానీ ఆ హీరోయిన్లే ఒక్కోసారి ఊహించని ట్విస్టులిచ్చి.. మింగుడుపడని షాకులిస్తున్నారు. కూటి కోసం కోటి విద్యలు అన్నట్టు. కెరీర్ ప్రారంభం నుంచి డీసెంట్‌గా కనిపించింది కీర్తీసురేశ్. ఇక 'మహానటి' చేసిన తర్వాత ఆమె ఇమేజే మారిపోయింది. దానికితోడు జాతీయ ఉత్తమనటి అనే ట్యాగు. ఈ బరువును పరువుగా మోయడం అంటే కష్టమే. కెరీర్ పల్టీ కొట్టే ప్రమాదం లేకపోలేదు. అందుకు తగ్గట్టే చేసిన లేడీ ఓరియెంటెడ్ సినిమాలన్నీ చేదు అనుభవాలే మిగిల్చాయి. ఇక తప్పేది లేక మహేశ్ 'సర్కారువారిపాట'తో పరిధుల్ని పక్కన పెట్టేసింది. కాస్త గ్లామర్ డోస్ పెంచి యువతరానికి అందాల ట్రీట్ ఇచ్చేసింది. మహానటి ఈ కొత్త అవతారం చూసి షాక్‌కి గురైన ప్రేక్షకులు కూడా లేకపోలేదు. లేటెస్ట్ న్యూస్ ఏంటంటే.. అధర చుంబనానికి కూడా సై అనేసింట ఈ అందాల భామ. కాకపోతే ఆ అదృష్టాన్ని మాత్రం ఉత్తరాది హీరోకి ఇచ్చేసిందట. ఎవరా హీరో అనుకుంటున్నారా? ప్రస్తుతం బాలీవుడ్‌లో 'బేబీ జాన్' అనే సినిమా చేస్తున్నది కీర్తిసురేశ్. ఆ సినిమాలో వరుణ్ ధావన్ హీరో. కథ, సన్నివేశం డిమాండ్ మేరకు ఆ సినిమాలో ముద్దు సన్నివేశం అనివార్యమైందట. దాంతో పాత్ర కోసం వరుణ్‌తో పెదవి ముద్దుకి 'సరే' అనేసిందట కీర్తి. ఏదేమైనా యూత్‌కి ఇదో కొత్త అనుభవం. రేపు ఈ సినిమా సీన్ కోసమే థియేటర్లు ఫుల్ అవుతాయనడంలో అతిశయోక్తి లేదు.



# నేటి యువత మెచ్చేలా..

అజయ్, వంశీ, ఆదిత్య శశాంక్, రోమిక శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వి లవ్ బ్యాడ్ బాయ్స్'. రాజు రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనక దుర్గారావు నిర్మిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఏ.సర్టిఫికెట్ లభించింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్ర టీజర్‌ను యువ దర్శకుడు వశిష్ట విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి యువతకు కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వి.కె.రామరాజు, సంగీతం: రఘు కుంచె, భూషణ్ జాన్, సంభాషణలు, స్క్రీన్‌ప్లే: ఆనంద్ కొడవటిగంటి.

# అఘోరతో సాహస యాత్ర

విశ్వక్‌సేన్ అఘోరా పాత్రలో నటిస్తున్న చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకుడు. అడ్వెంచరస్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మార్చి 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో మానవ స్పర్శను అనుభవించలేని అరుదైన వ్యాధితో బాధపడే అఘోరా పాత్రలో విశ్వక్‌సేన్ నటించారు. ఈ సినిమాలో యువ నాయిక చాందిని చౌదరి.. జాహ్నవి పాత్రలో నటిస్తున్నది. గురువారం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అఘోరాగా కనిపించే కథానాయకుడితో కలిసి ఆమె చేసే సాహస యాత్ర సినిమాలో ఆసక్తికరంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. హారిక పెడాడ, మహ్మద్ సమద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విశ్వనాథ్ రెడ్డి, సంగీతం: నరేష్ కుమారన్, నిర్మాత: కార్తీక్ శబరీష్, దర్శకత్వం: విద్యాధర్ కాగిత.



